



క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 26-07-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు...చల్ల రామకృష్ణ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను, మెస్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) ప్రధాన గేటు వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి.జె.వై.యం తెలంగాణ రాష్ట్ర మానిటరింగ్ కన్వీనర్ చల్ల రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.





# ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో

**విద్యార్థులకు బెడ్ షీట్స్ అందజేత...**

**విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలి...**

**చౌటుప్పల్ ఎమ్మార్వో వీరబాయి**

**చౌటుప్పల్, జులై 25, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల,కళాశాల బాలికల వసతి గృహాన్ని శనివారం ఎమ్మార్వో వీరాబాయి ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికలకు అందుతున్న పలు వసతులను, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. వంటగదిలోకి వెళ్లి విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు.అనంతరం స్టోర్ రూమ్ లోని సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు ఎమ్మార్వో తన చేతుల మీదుగా బెడ్ షీట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.హాస్టల్ లో మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహారం, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని,పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు.గత సంవత్సరపు విద్యార్థుల లాగానే ఈ విద్య సంవత్సరం కూడా ప్రథమ,ద్వితీయ సంవత్సరపు విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థులు తమకు హాస్టల్లో అన్ని వసతులు బాగున్నాయని, హాస్టల్ వార్డెన్ తమను బాగా చూసుకుంటున్నారని సమాధానం ఇవ్వడంతో ఎమ్మార్వో, హాస్టల్ వార్డెన్ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మల్లిక,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







# అపర భగీరథుడు తుమ్మలకు కృతజ్ఞతలు

## -మర్యాద పూర్వకంగా కలిసిన “డా.పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్” సభ్యులు

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం** గోదావరి నది జలాలను ఖమ్మం జిల్లా నేలపైకి తీసుకొచ్చిన అపర భగీరథుడు తుమ్మల నాగేశ్వరరావుకు డాక్టర్ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలో తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖమ్మం జిల్లా వ్యవసాయ భూములు ఎండిపోతున్నందున సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలో పారించిన అపర భగీరథుడు తుమ్మల అని కొనియాడారు. జిల్లాలో సాగు, తాగు నీటి ఎద్దడి ఈ సందర్భంగా పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు అలాగే కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి పూనుకొని ఖమ్మం నగరం ప్రఖ్యాత నగరంగా మారడానికి కంకణం కట్టుకున్న ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు 47 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హరిత భవనం కూడా జిల్లా జాతిని మరింత చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాయక్ వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శిలు మాధవరావు శ్రీనివాసరావు ట్రెజరరీ వరప్రసాదరావు నారాయణ పుల్లయ్య పవన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగంలో వినూత్న పరిశోధన...



# విద్యుత్ రంగంలో వినూత్న పరిశోధన...

**యాదాద్రి భువనగిరి బ్యూరో, జూలై 25(క్రైమ్ మిర్రర్):** చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన డా. శ్రీకాంత్ గంజి ఉస్మానియా విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎ), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ సిస్టమ్, యూనిఫైడ్ పవర్ క్వాలిటీ కండిషనర్ సంబంధిత అంశాలపై వినూత్న పరిశోధనలు నిర్వహించి పీహెచ్.డి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.జైకేసారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ గంజి చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచారు. తండ్రి గంజి దాసు, తల్లి గంజి జయలక్ష్మి ఎల్లప్పుడూ చదువుకు అండగా నిలిచారు. పీహెచ్.డి అభ్యాస కాలంలో కూడా వారి ఆశీస్సులు, సహకారం ఆయనకు ధైర్యాన్నిచ్చాయి. అలాగే సోదరీమణులు లత, గీత ఎల్లప్పుడూ ఆయనను ప్రోత్సహిస్తూ అండగా నిలిచారు. భార్య లక్ష్మణ సహకారం లేక సాధనలో ఇంతటి విజయం సాధించడం సాధ్యపడేది కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం వారికి మూడేళ్ల వయస్సు గల కుమార్తె ఉంది. విద్యార్థి దశ నుంచే ప్రతిభ కనబరిచిన ఆయన 7వ తరగతిలో గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై ఏపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. పదో తరగతిలో 91 శాతం, ఇంటర్మీడియట్‌లో 95 శాతం మార్కులు సాధించారు. అనంతరం సివిఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నుండి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బి.టెక్‌ను డిస్టింక్షన్‌తో పూర్తి చేశారు. పీటీపీజీ లో ప్రథమ ర్యాంకు, పీజీసెట్ లో రాష్ట్ర 11వ ర్యాంకు సాధించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పవర్ సిస్టమ్స్‌లో ఎం.టెక్ పూర్తి చేశారు. అనంతరం అదే విశ్వవిద్యాలయంలో పీహెచ్.డి పట్టా అందుకున్నారు.ప్రస్తుతం ఆయన విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (విట్స్), హైదరాబాద్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 17 అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. ఏఎస్టీఆర్ఎ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నారు. పరిశోధన రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన ఆయన ఐఈఈఈ , స్ప్రింజర్ , ఎస్విఇ , స్కోపస్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జర్నల్స్, సదస్సుల్లో అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ ఎనర్జీ క్వాలిటీ రంగాల్లో నాలుగు భారతీయ పేటెంట్లు సాధించి పరిశోధకుడిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ డా. జి. యేసురత్నం సహా-పరిశోధన మార్గదర్శకత్వంలో ఆయన ఈ పరిశోధనలు నిర్వహించారు.



## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని శ్రీ శివరామాలయం,రామాలయం,భక్త మార్కండేయ దేవాలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. భక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు తిరందాసు ప్రవీణ్ కుమార్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు..ఆలయ అధ్యక్షులు కృపానంద్,సంజయ్, జ్ఞాని,భారతీ,మహిళ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారులతో వర్ణిక శ్రీ, విహాన్ తేజ్ జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, జూలై 25:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనాథ పిల్లల పాఠశాలలో వర్ణిక శ్రీ మొదటి జన్మదినం, ఆమె సోదరుడు విహాన్ తేజ్ జన్మదినం సందర్భంగా అల్పాహార సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 300 మంది చిన్నారులకు రుచికరమైన అల్పాహారాన్ని అందజేశారు. చిన్నారులు ఆనందంగా అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్‌తో పాటు సమితి సభ్యులు పాల్గొని వర్ణిక శ్రీ, విహాన్ తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పాఠశాల చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించాలని కోరారు.

## అక్రమ కార్యకలాపాల నిర్వహణపై స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్ , జూలై 24:** వనస్థలిపురం ఓంకార్ నగర్‌లోని రిలైట్ వెల్ బ్యూటీ & స్పా పేరుతో నిర్వహిస్తున్న స్పా సెంటర్‌లో అక్రమంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ మేరకు 24.07.2026 తేదీన సాయంత్రం సుమారు 7:30 గంటల సమయంలో ఎస్.ఐ, జి. గిరీష్ కుమార్ అందుబాటులో ఉన్న సిబ్బందితో కలిసి స్పా సెంటర్‌పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీల సమయంలో ఒక మహిళా థెరపిస్ట్ స్పాకు వచ్చిన పురుష కస్టమర్‌కు క్రాస్ మసాజ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.దీంతో స్పా మేనేజర్ సాయి సంతోష్, స్పా యజమాని బండావత్ శివ దుర్గాలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు ప్రస్తుతం విచారణ దశలో ఉందని పోలీసులు తెలిపారు.




## పేదల ఆకలి తీర్చేందుకే అన్నదానం చేస్తున్నాం...

### హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్....



**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** ఆకలితో అలమటిస్తున్న బడుగు బలహీన వర్గాలకు పాదచారులకు, చందానగర్ గంగారం లోని వివిధ షోరూం పని చేస్తున్న ప్రజలకు ప్రతి శనివారం సుమారు 3000 మంది కి అన్నదానం నిర్వహించడం హర్షణీయమని స్థానిక ప్రజలు అన్నారు. హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ నియమ నిబంధనలు పాటిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నె అపర్ణ, అన్నె సందీప్, విష్ణు మూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, విజయ్, ప్రకాష్, దత్తు, సురేష్, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**కూకట్ పల్లి, జూలై 25 (క్రైమ్ మిర్రర్) :**విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా, సంబంధిత కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని అన్నారు. జూలై 26 నుంచి ఆగస్టు 5 వరకు కళాశాలల స్థాయిలో గేట్ మీటింగ్‌లు నిర్వహించి, విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు, నెరవేర్చని హామీలపై అవగాహన కల్పించాలని, ఆగస్టు 7 నుంచి 12 వరకు జిల్లా కేంద్రాల్లో 5,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీలు నిర్వహించి, జిల్లా కేంద్రాల్లో మాస్ బైక్ షోలు నిర్వహిస్తామని అన్నారు. ఆగస్టు 17, 18 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫీజు బకాయిల కారణంగా నిలిచిపోయిన సర్టిఫికెట్లు వెంటనే విడుదల చేసి, 40లక్షల విద్యార్థుల చదువులు, ఉద్యోగ అవకాశాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పెంపు, హాస్టల్ మెస్ ఛార్జీల పెంపు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, విద్యార్థుల సంక్షేమానికి ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు పితాని సందీప్ గౌడ్, విశ్వవిద్యాలయ విద్యార్థులు అఖిల, స్పందన, స్ఫూర్తి, సాయిరామ్, మనీష్, నితిన్, కారుణ్య, జ్ఞానేశ్వర్, సంపత్, శ్రీను నాయుడు, వర్షిత్, తరుణ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్-మక్త డివిజన్లలో ఎస్ఐఆర్ కార్యక్రమం పర్యవేక్షించిన యలమంచి ఉదయ్ కిరణ్

**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ )కార్యక్రమంలో భాగంగా యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ మియాపూర్-మక్త డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.ప్రగతి ఎన్క్లేవ్, ఆర్బీఆర్, జనప్రియ వెస్ట్ సిటీ, ప్రజయ షెల్టర్స్, బీకే ఎంక్లేవ్, మక్త, జేపీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులతో కలిసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్ణీత గడువులోపు ఓటరు జాబితా సవరణ పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో సులభంగా సమర్పించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సహకరించాలని బీఎల్ఓలకు సూచించారు.ఈ కార్యక్రమంలో రావిపాటి వెంకటేశ్వరరావు, శంకర్ చారి, మహేశ్వర్, గోవర్ధన్, ఐన రెడ్డి, శ్రీకాంత్, సదానందం, గోపాల కృష్ణ, విజయ లక్ష్మి, రామకృష్ణ, శరత్, మధు, రాధాకృష్ణ, సతీష్, ప్రవీణ్, వంశీ, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి





- విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు
- ఎంజేపీటీ భాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పోలీసుల అవగాహన..
- విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలి
- చౌటుప్పల్ ఎస్సై యాదగిరి
- ఎంజేపీటీ పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ బీ. శిరీష రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 25(క్రైమ్ మిర్రర్):** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చౌటుప్పల్ ఎస్సై యాదగిరి తెలిపారు. శనివారం చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపిటి బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రిన్సిపాల్ బి శిరీష రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ ఎస్సై యాదగిరి హాజరై మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెంచవలసిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులపై కూడా ఉందని తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత క్రమశిక్షణను అలవర్చుకోవాలని, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవరి దగ్గరైనా గంజాయి, మత్తు పదార్థాలు చూసినా,విక్రయాలు జరుగుతున్నా...కళాశాల యాజమాన్యం దృష్టికి లేదా పోలీసులకు బాధ్యతగా తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు . విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ సమయంలో తప్పుడు మార్గాల వైపు ఆకర్షితులు కాకుండా లక్ష్యం వైపు ప్రయాణం సాగించాలన్నారు. రోడ్డు ప్రయాణంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను రక్షించుకోవచ్చునని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ లో మాట్లాడటం, అతివేగం, నిర్లక్ష్యంగా, మధ్యమత్తులో వాహనం నడపడం వంటివి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే అట్టి వాహనదారుడు పై కేసు నమోదు అవుతుందని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ ను కచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యులకు కూడా చైతన్యం కలిగించాలని కోరారు. విద్యార్థులు క్షణికావేశంలో తెలిసి తెలియక ఎటువంటి నేరాలకు పాల్పడిన భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ అవకాశాలను కోల్పోతారని హెచ్చరించారు. అనంతరం ప్రిన్సిపాల్ బి శిరీష రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు పోలీసులు సూచించిన విషయాలపై అవగాహన పెంపొందించుకొని తప్పక పాటించాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి శిరీష రెడ్డి, ఏటీపీలు బి రవికుమార్,బి మహేంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## మునుగోడులో మందుల సామెల్ పై ఫైర్

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని విమర్శించే అర్హత మందుల సామెల్ కు లేదని మునుగోడు కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు..కులం మతం ప్రాంతం అనే తేడా లేకుండా రాజగోపాల్ రెడ్డి చేస్తున్న సేవలు తెలంగాణకే ఆదర్శం అని గుర్తుకు తెచ్చారు.సాయం చేసిన మనిషిపై దుమ్మెత్తి పోస్తూ నీ నీచపు తత్వాన్ని దళిత జాతికి పుస్తున్నావ్ అని మండిపడ్డారు.మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, జాల వెంకన్న యాదవ్,పందుల నరసింహ,పందుల భాస్కర్,మాదగోని రాజేష్ గౌడ్,పాలకూరి యాదయ్య గౌడ్,కుంభం చెన్నారెడ్డి,మిరియాల వెంకన్న,పంతంగి స్వామి,సర్పంచులు ఏర్పుల మోహన్ బాబు,జీడిమెట్ల సైదులు,దాసరి గోవర్ధన్,కదిరి లింగయ్య,చీమల రాజు, కంభంపాటి వెంకటేశ్వర్లు, మక్కెన అప్పారావు,నకిరేకంటి యాదయ్య,శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారి ఎడిఏ కు వినతి పత్రం



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** యూరియా డిఏపి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు ప్రజాసేవకులు బోయ లింగస్వామి ఏడిఏ బి వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేశారు.

# గచ్చిబౌలిలో నకిలీ హాలిడే ప్యాకేజీల మోసం..





## 15 మంది కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ అరెస్ట్

**గచ్చిబౌలి క్రైమ్ మిర్రర్ :** న్యూఢిల్లీకి చెందిన 4ఆర్ సీసన్స్ హాలిడేస్ ప్రైవేటలిమిటెడ్ సంస్థ యూనిట్ “ది పసిఫిక్ హాలిడే వరల్డ్” పేరుతో నకిలీ హాలిడే ప్యాకేజీలు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. గచ్చిబౌలి పోలీసులు దాడి చేసి కంపెనీలో పనిచేస్తున్న 15 మంది కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ ను అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కంపెనీ మార్కెటింగ్ సిబ్బంది హైదరాబాద్ తో పాటు పలు ప్రధాన నగరాల్లో ప్రముఖ షాపింగ్ మాల్స్, కమ్యూనిటీ సెంటర్లలో స్టాల్స్ పెట్టి అకర్షణీయ వాక్యాలతో ఉచిత కూపన్లు, గిఫ్ట్ వోచర్లు ఇస్తామని ప్రజలను ఆకర్షించేవారు. అలా సేకరించిన మొబైల్ నంబర్లకు తర్వాత ఫోన్ చేసి రాజస్థాన్ హాలిడే, గచ్చిబౌలి వంటి స్థలాలకు ఆహ్వానించి, కంపెనీ హాలిడే మెంబర్‌షిప్ పథకాల గురించి ఆడంబరంగా వివరించేవారు. 1,25,000 చెల్లిస్తే 5 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం ఒకసారి భారతదేశంలో ఎక్కడైనా 7 రాత్రులు ఉచిత బస, ?10 లక్షల మెంబర్ ఫీజు చెల్లిస్తే ప్రతి సంవత్సరం విదేశాల్లో కూడా 7 రాత్రులు బస కల్పిస్తామని నమ్మబలికేవారు. ఈ విధంగా ఒత్తిడి చేసి, వివిధ ఆఫర్లు, డిస్కౌంట్లు చూపించి ప్రజల నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసేవారు. 24.07.2026న వచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు దాడి చేసి రాజేష్ కుమార్, మొహమ్మద్ ఆజిఫ్, అజయ్ రెడ్డి, రాజు సింగ్ ధామి సహా 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో ఇప్పటివరకు 19 మంది బాధితులు గుర్తించామని, వీరు వివిధ రాష్ట్రాలకు చెందిన వారని, వారికి ?22 లక్షల వరకు మోసం జరిగినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**పోలీసుల విజ్ఞప్తి..**

హాలిడే మెంబర్‌షిప్ లు, టూర్ ప్యాకేజీల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, ఆకర్షణీయమైన ఆఫర్లు, స్టార్ హోటళ్లలో నివసించే ప్రలోభాలకు లొంగవద్దు. కంపెనీ వివరాలను పూర్తిగా పరిశీలించకుండా డబ్బులు చెల్లించవద్దని పోలీసులు సూచించారు.

## రాచకొండ లో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**సంస్థాన్ నారాయణపురం, జూలై 25(క్రైమ్ మిర్రర్):** తొలి ఏకాదశి సందర్భంగా రాచకొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనాలు భక్తులు నిర్వహించారు. అనంతరం శ్రీ భవరాంబిక భక్త భజన బృందం కొయ్యలగూడెం వారిచే భజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచప్ప సమితి అధ్యక్షులు బద్దుల కృష్ణ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేశం,సలహాదారులు కడారు అంజిరెడ్డి, సభ్యులు రవీందర్ రెడ్డి, రమాదేవి, జరుకుల భాస్కర్, ఆలయ పూజారి లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.



## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం ఐశ్వర్య లక్ష్మి భరతనాట్య ప్రదర్శనలో ఝుమ్ ఝుమ్ పుష్పాంజలి, కామాక్షి స్వరజతి, పదం, శివరంజని తిల్లాన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీమతి డాక్టర్ బిందు అభినయ్ శిష్య బృందం ప్రదర్శనలో జతిస్వరం, దశావతర శబ్దం, అంబ నీరాజనం, నీలమేఘ శరీర, భజమానస, డోలాయఞ్చల, చక్కని తల్లికి, గరుడ గమన, కృష్ణం కలయ సఖి, దశావతార వరద, జయము జయము అంశాలను అన్విత, షణ్ముఖి, సంహిత, ఈషా, తన్మయీ, హరిణి, భవాని, మేధా,పూజిత అనఘా, హంసిని,ఆధ్య, మనస్విని, ప్రతుల్య, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు



## విద్యార్థి-యువజనుల పోరాట ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా...

### ప్రజాస్వామ్యం గెలిచింది.. టి. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు...



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా స్వామ్య శక్తులు సాగించిన నిరంతర పోరాటాల విజయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ పేర్కొన్నారు.నీట్ వ్యవహారంలో జరిగిన అవకతవకలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న అక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థు లు, యువజనులు దేశవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గేలా చేశాయని ఆయన అన్నారు. ప్రజల ఐక్య పోరాటం ముందు అధికార అహంకారం నిలవదని ఈ పరిణామం నిరూపించిందన్నారు.విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విరమించు కోవాలని, పారదర్శకమైన, సమాన అవకాశాలు కల్పించే విద్యా విధానాన్ని అమలు చేయాలని టి. రామకృష్ణ డిమాండ్ చేశారు. నీట్ వంటి పరీక్షల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే విధానాలను పునఃసమీక్షించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ప్రజల చైతన్యపూర్వక పోరాటాలేనని, విద్యార్థులు, యువజనులు ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై మరింత ఐక్యంగా ఉద్యమించాలని టి. రామకృష్ణ పిలుపునిచ్చారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



**క్రైమ్ మిర్రర్,మంగపేట** కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని దోమెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు,మండల సోషల్ మీడియా ఇంచార్జీ పల్నాటి సంతోష్ తల్లి పల్నాటి రమాదేవి అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి శనివారం వారి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి వైద్య చికిత్సకు ఖర్చుల నిమిత్తం రూ,5,000 నగదును ఆర్థిక సాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆర్టిఐ ఉహ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి,ములుగు మార్కెట్ కమిటీ సభ్యుడు కొమురం బాలన్న,మండల మీడియా ఇంచార్జ్ బసారీకారి నాగార్జున్,దోమెడ గ్రామ కమిటీ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వర్లు,బ్రాహ్మణపల్లి అధ్యక్షుడు సున్నం ఆనందం,యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల సాయి పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### తొలి ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ దంపతులు



**క్రైమ్ మిర్రర్ – శంకర్‌పల్లి** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించు కుని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యా లతో, సుఖ సంతోషాలతో జీవించాలని వారు ప్రార్థించారు. భక్తిశ్రద్ధల తో స్వామి వారిని దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతి పొందినట్లు తెలిపారు.

## నారగుట్టపై మైనింగ్ క్రషర్ మిల్లు ఏర్పాటును రద్దు చేయాలి

**– 28 మైనింగ్ క్రషర్ మిల్లు ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం**

**– తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ డిమాండ్**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 25(క్రైమ్ మిర్రర్):**భువనగిరి మండల పరిధిలోని తోక్కాపురం , గౌస్ నగర్, ఎర్రంబల్లి, నమాత్ పల్లి గ్రామల మధ్యన ఉన్న నారగుట్టపై స్టోన్ క్రషర్ మిల్లును ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవద్దని వెంటనే మిల్లు ఏర్పాటును రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈనెల 28న జరిగే ప్రజాభిప్రాయ సేకరణ జిల్లా కలెక్టర్ రద్దు చేయాలని లేకపోతే అన్ని వర్గాల ప్రజలను సమీకరించి అడ్డుకుంటామని ఒక ప్రకటన ద్వారా వారు హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం సుమారు 40 కి పైగా స్టోన్ క్రషర్ మిల్లులు, క్వారీలు వివిధ మండలాల్లో ముఖ్యంగా భువనగిరి, భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, తుర్కపల్లి, బీబీనగర్ వంటి ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. స్టోన్ క్రషర్ మిల్లుల వల్ల స్థానిక ప్రజలు, పర్యావరణ కాలుష్యము ఎదుర్కొంటున్నారని తెలిపారు. తీవ్రమైన వాయు దుమ్ము కణాలు రాళ్లను క్రష్ చేసేటప్పుడు మరియు లారీల ద్వారా రవాణా చేసేటప్పుడు విపరీతమైన మైక్రో ధూళి గాల్లోకి లేస్తుందపని, క్రషర్ల చుట్టుపక్కల ప్రాంతాలు ఎప్పుడూ దుమ్ము ధూళితో నిండిపోయి, సరిగ్గా దారి కనిపించని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రజల శ్వాసకోశ వ్యాధులు మరియు నిరంతరం దుమ్మును పీల్చడం వల్ల స్థానిక ప్రజలు, చిన్నపిల్లలు మరియు వృద్ధులు అస్తమా, బ్రాంకైటిస్ వంటి ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రాతి ధూళి వల్ల ఊపిరితిత్తులకు వచ్చే ప్రాణాంతకమైన 'సిలికోసిస్' వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారని కళ్లమంటలు, చర్మ అలర్జీలు వస్తాయని తేలిపారు. భారీ యంత్రాల శబ్దాల వలన క్రషర్ మిల్లుల్లో వాడే భారీ గ్రైండింగ్ మిషన్లు, బ్రేకర్ల వల్ల రాత్రింబగళ్లు విపరీతమైన శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని, స్థానికుల్లో నిద్రలేమి, వినికిడి లోపం మరియు మానసిక ఒత్తిడి పెరుగుతాయని తెలిపారు. వ్యవసాయం కూడా దెబ్బతింటుందిని, పంట దిగుబడి తగ్గుతుందని , భూగర్భ జలాలు తగ్గుతాయని, సహజసిద్ధమైన కొండలు , గుట్టలు కూడా మాయమవ్వడం వల్ల స్థానిక జీవవైవిధ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తంచేశారు. భారీ లోడుతో కూడిన టిప్పర్లు , లారీలు నిరంతరం తిరగడం వల్ల గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతాయని, వేగంగా వెళ్లే లారీలు, వాటి నుంచి రోడ్డుపై పడే రాళ్ల ముక్కలు మరియు లేచే దుమ్ము వల్ల ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ఇలాంటి ప్రమాదకరమైన స్టోన్ క్రషర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడాలని నర్సింహ పిలుపునిచ్చారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా - దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయం

**దేశంలో మహిళలు, యువత పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తి: రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి**
నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయమని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ అన్నారు. దేశంలో మహిళలు, యువత చేస్తున్న పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవినీతి బురదలో నిండా మునిగిపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, దేశ యువత ఆశలను, ఆశయాలను అధికార మదంతో అణచివేయాలని చూసిన మోడీ నియంతృత్వానికి రోజులు దగ్గర పడ్డాయని శ్రీజ్యోతి భీమ్ భరత్ విమర్శించారు.
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ దేశ యువత పోరాటాన్ని ఆపబోదని, రాబోయే కాలంలో అన్ని శాఖల మంత్రులు, మోడీతో సహా గద్దె దిగాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ దేశ యువత చేస్తున్న పోరాటంలో వారితో పాటు నిలిచి లాఠీ దెబ్బలు తిని, అక్రమ అరెస్టులకు సైతం సిద్ధపడిన కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని తెలిపారు. ఈ సందర్భంగా వెన్నుచూపకుండా మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా, జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలను తొలగిస్తూ పోరాడి, విజయం సాధించిన ఈ దేశ యువత పోరాట స్ఫూర్తిని శ్రీజ్యోతి భీమ్ భరత్ అభినందించారు.

## వేదఘోషల మధ్య వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు..!!

**- తొలి ఏకాదశి వేళ కాళేశ్వరంలో ఆధ్యాత్మిక వైభవం**

**- భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహాన్యాస పూర్వక లఘురుద్రాభిషేకం**

**- తీర్థప్రసాదాల పంపిణీతో ముగిసిన ఆధ్యాత్మిక కార్యక్రమం**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ చంద్రశేఖర్ స్వామి దేవాలయంలో మహాన్యాస పూర్వక లఘురుద్రాభిషేకం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాళేశ్వరం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదపండితులు వేదఘోషల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి పరమశివుని అనుగ్రహాన్ని ప్రార్థించారు. ఉదయం బ్రహ్మముహూర్తం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరగా, ఆలయమంతా "ఓం నమఃశివాయ" నామస్మరణతో మారుమోగింది. మహాన్యాస పూర్వక లఘురుద్రాభిషేకాన్ని వేదపండితులు అత్యంత నియమనిష్ఠలతో నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, కొబ్బరి నీరు, గంగాజలంతో పాటు వివిధ పవిత్ర ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం బిల్వదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, మహామంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజున శివారాధన, విష్ణు ఆరాధ న రెండింటికీ విశిష్టమైన ప్రాధాన్యం ఉంద న్నారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజపరంగా శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు చేకూరుతాయని పేర్కొన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి ఇంటా ఐశ్వర్యం నెలకొనాలని ప్రత్యేక సంకల్పంతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అభిషేక సేవల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం బ్రాహ్మణ సంఘం సభ్యులు తగిన ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.



## ఇటీవల మృతిచెందిన నిమ్మల వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేత

### మాజీ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్, బచ్చు రాధకిషన్ గుప్తా

**ఆత్మకూరు(ఎం),జూలై25/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ల గ్రామంలో ఇటీవల అకాలమరణం చెందిన నిమ్మల లచ్చయ్య కుమారుడు వెంకటేష్ ఆత్మకి శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కూరెళ్ళ మాజీ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్ 5000 రూపాయలు మరియు బచ్చు రాధా కిషన్ గుప్తా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం ముత్తమ్మ, ఉప సర్పంచ్ హనుమంతుల రమేష్,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్,సెక్రెటరీ గడ్డం అశోక్ కుమార్, జిల్లా నాయకులు మోతేయాదిరెడ్డి, ఉప్పల నరసింహ, వార్డు మెంబర్ వడ్లకొండ ధనలక్ష్మి నరసింహ, నాయకులు యాద మల్లయ్య, ముత్తయ్య ,రవి ,వెంకన్న, సత్తయ్య ,నరసింహ, యాదయ్య, వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఎంపీడీఓ లను మర్యాద పూర్వకంగా కలిసిన పల్లెర్ల చేనేత సహకార సంఘం పాలకమండలి

### సన్మానించిన అధ్యక్షుడు పొడుగు వెంకటేశం పాలకవర్గ సభ్యులు



**ఆత్మకూరు(ఎం),జూలై25/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామం శనివారం రోజు పల్లెర్ల చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లావణ్యని , ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో రాములు నాయక్ ని పాలక వర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. వారు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం పాలక వర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు . ప్రభుత్వ పాలన పరంగా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు . చేనేత కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటె మా దృష్టికి తీసుకొని రావాలని అన్నారు . ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం , కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ , కోశాధికారి సాయిని పురుషోత్తం , చేనేత సంఘం డైరెక్టర్లు గుర్రం మల్లేష్ , వట్నాల వెంకటేష్ , రాపోలు శ్వేత వెంకటేష్ పాల్గొన్నారు .

## దేశ విద్యార్థి లోకం సాధించిన చారిత్రాత్మక విజయం



**ఆత్మకూరు(ఎం),జూలై25/క్రైమ్ మిర్రర్:** నీట్ పరీక్షలో జరిగిన అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని స్పందించేలా చేసింది. కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఇది విద్యార్థుల ఐక్యతకు, యువశక్తికి నిదర్శనం. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దేశ విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, పారదర్శకమైన పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.ఈ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీకి, అలాగే ఉద్యమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన ఆత్మకూరు(ఎం)పట్టణ ఎన్ఎస్యూఐ అధ్యక్షుడు లోడి మహేష్ గౌడ్.

# కాకా కుటుంబంపై విమర్శలు చేస్తే ఊరుకోం!

### కేటీఆర్‌ను 50 ఉద్యోగాలు అడగడం తప్పా? అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్‌పై అసత్య ప్రచారాలు పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్



**రామకృష్ణాపూర్, జులై 25 ( క్రైమ్ మిర్రర్)** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ స్పందిస్తూ.. "అంకుల్, మీకు 50 ఏళ్లు నిండాయి.. నిరుద్యోగులకు కనీసం 50 ఉద్యోగాలు ఇవ్వండి" అని సామాజిక మాధ్యమాల్లో పెట్టిన సందేశంలో అవమానించే అంశం ఏముందో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా నిరుద్యోగ యువత తరఫున న్యాయమైన ప్రశ్న అడిగితే వ్యంగ్యంగా మాట్లాడారని చిత్రీకరించడం తగదన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన బాల్క సుమన్ పార్లమెంట్‌లో ఏనాడూ ప్రజా సమస్యలపై మాట్లాడలేదని.. వంశీకృష్ణ గెలిచిన స్వల్ప కాలంలోనే కార్మికుల పెన్షన్లు, ఆదాయ పన్ను రద్దు, తాడిచర్ల ఫేజ్-2, రోడ్ల విస్తరణ, రైల్వే హాల్ట్‌లు, కొత్త లైన్ల పురోగతి వంటి అనేక అంశాలపై గళమెత్తారని గుర్తుచేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ?8 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులతో పనులు ప్రారంభించడంతో పాటు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జోడువాగుల ప్రాజెక్టుకు కేంద్ర మంత్రులతో చర్చించి అటవీ శాఖ క్లియరెన్స్ సాధించిన ఘనత వంశీకృష్ణకే దక్కుతుందన్నారు. నియోజకవర్గానికి సుమారు ?8,000 కోట్ల అభివృద్ధి నిధులు తేవడంలో ఆయన కీలక పాత్ర పోషించారని వెల్లడించారు.మరోవైపు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 64 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దడం, గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక జీవో ఇచ్చి ఆరోగ్య బీమా కల్పించడం, టామ్‌కామ్ ద్వారా జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి విదేశీ ఉద్యోగాలు కల్పించడం, మందమర్రి స్కిల్ సెంటర్ ద్వారా నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు.గత బీఆర్ఎస్ హయాంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలు, గ్రూప్-1, 2, 3 పరీక్షల రద్దులు, వాయిదాలతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు నాశనం చేశారని ఆరోపించారు. 2019లో ఇంటర్ ఫలితాల వివాదంలో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే కనీసం ఓదార్చని చరిత్ర బీఆర్ఎస్ నేతలదని ధ్వజమెత్తారు. ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న కాకా కుటుంబ ఆదరణను జీర్ణించుకోలేకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు, కాకా అభిమానులు ప్రజాస్వామ్యబద్ధంగా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షురాలు మంద సృజన, ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ, కార్యదర్శి కునారపు శివకుమార్, నాయకులు బొద్దుల ప్రేమ్‌సాగర్, నాగుల రాజ్‌కుమార్, ఆలేటి వెంకటేష్, రాజు, ఏల్పుల స్వామి, పింగిలి సంతోష్, మహిళా నాయకులు దీప, అనూష తదితరులు పాల్గొన్నారు.

# గుండా కరుణాకర్ రెడ్డికి ఘన సన్మానం

### -మందడి ఇజ్రాయిల్ ఖమ్మం జిల్లా జేఏసీ అధ్యక్షుడిగా నియామకం



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం లోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ జేఏసీ నూతన చైర్మన్ గుండా కరుణాకర్ రెడ్డికి ఘనంగా సన్మానం నిర్వహించారు. మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా మండల ప్రజలు రాజకీయ నాయకులు స్నేహితులు మేధావులు విద్యావేత్తలు హాజరై కరుణాకర్ రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుండా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని నాయకులు ప్రజలు మేధావులు విద్యావేత్తలు మహనీయులు అందరూ కలిసి తనను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. గుండా కరుణాకర్ రెడ్డి తనపై చూపిన అభిమానానికి ఆత్మీయతకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందడి ఇజ్రాయిల్ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో అనుభవాలను ఎదుర్కొంటూ ప్రజల కోసం నిరంతరం ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మందడి ఇజ్రాయిల్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇదే సన్మాన సభవేదికపై మందడి ఇజ్రాయిల్ ని ఖమ్మం జిల్లా జేఏసీ అధ్యక్షుడిగా రాష్ట్ర జేఏసీ చైర్మన్ గుండా కరుణాకర్ రెడ్డి నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మందడి ఇజ్రాయిల్ కి పలువురు నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు.

# ఆత్మకూరు(ఎం)మండల సీనియర్ సిటిజన్స్ ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### సీనియర్ సిటిజన్స్ మండల కమిటీ అధ్యక్షుడు లోడి శంకర్ గౌడ్



**ఆత్మకూరు(ఎం),జూలై 25/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సీనియర్ సిటిజన్ల మండల కమిటీ అధ్యక్షుడు లోడి శంకర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ తమకు తమ కుటుంబ సభ్యుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా పారాలీగల్ వాలంటీర్ గా నియమించబడి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న కానుగంటి శ్రీశైలం(రిజిస్ట్రేషన్ నెం:B1/1/3/DLSA/2023)ని కలిసి ఇబ్బందులు పడుతున్న సీనియర్ సిటిజన్లకు కుటుంబ, ఆస్తి, భరణం, వేధింపులు, పెన్షన్, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర న్యాయపరమైన సమస్యలు ఏవైనా ఉంటే, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఉచిత న్యాయ సహాయం అందించడానికిగాను సిద్ధంగా ఉంటారని మండల సీనియర్ సిటిజన్స్ కమిటీ అధ్యక్షుడు శంకర్ అన్నారు. ఈమొబైల్ నంబర్ కు: 9866835445 కాల్ చేసి తమ సమస్యలను తెలపవచ్చునని అన్నారు. సీనియర్ సిటిజన్స్ ఈ ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల కమిటీ అధ్యక్షుడు లోడి శంకర్ గౌడ్ విజ్ఞప్తి చేస్తున్నారు.

# నరసింహుని కోపాన్ని శాంతింపజేసిన నేరేడు చెట్టు

**ఆత్మకూరు(ఎం),జూలై25/క్రైమ్ మిర్రర్:**



ప్రకృతి వైవిధ్యంతో నిండిన ఈ భూమిపై అనేక వృక్షాలు మన జీవితాలతో విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయి. వాటిలో "నేరేడు చెట్టు"ఒక ప్రత్యేక స్థానం కలిగిన వృక్షం. నలుపు-ఊదా రంగులో ఉండే రసభరితమైన పండ్లను అందించే ఈ చెట్టు కేవలం ఆహారానికి మాత్రమే పరి మితం కాకుండా, ఆరోగ్యం, సంస్కృతి మరియు పౌరాణిక విశ్వాసాలకు కూడా ప్రతీకగా నిలిచింది. నేరేడు పండ్లు సాధారణంగా వేసవి కాలం చివరలో, వర్షాకాలం ప్రారంభ సమయంలో లభిస్తాయి. వాటి తీపి-పులుపు రుచి మరియు ప్రత్యేకమైన సువాసన ప్రజలను ఆకర్షిస్తాయి. దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాలలో ఈ చెట్లు సహజసిద్ధంగా పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో నేరేడు చెట్టును దేవవృక్షంగా గౌరవించే సంప్రదాయం కూడా ఉంది. హిందూ పురాణాలలో నేరేడు చెట్టుకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన ప్రస్తావనలు కనిపిస్తాయి. ముఖ్యంగా నరసింహ అవతారంతో ముడిపడిన ఒక జానపద గాథ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. పురాణాల ప్రకారం, హిరణ్యకశిపుని సంహరించిన తరువాత నరసింహ స్వామి ఉగ్రరూపంతో భూమిపై సంచరించాడని చెబుతారు. ఆయన కోపాన్ని శాంతింపజేయడానికి దేవతలు, ఋషులు ప్రార్థనలు చేశారు. ఆ సమయంలో నరసింహుడు ఒక దట్టమైన అరణ్యంలో ఉన్న నేరేడు చెట్టు నీడలో విశ్రాంతి తీసుకున్నాడని జానపద కథనం చెబుతోంది. ఆ చెట్టు పండ్లను తిన్న తరువాత ఆయన ఉగ్రత తగ్గి, శాంత స్వరూపాన్ని ధరించాడని విశ్వాసం. అందుకే నేరేడు చెట్టును"శాంతికి ప్రతీక"గా భావిస్తారు. కొన్ని ప్రాంతాల్లో నరసింహ స్వామి ఆలయాల సమీపంలో నేరేడు చెట్లను నాటే ఆచారం కూడా ఉంది. మరో విశ్వాసం ప్రకారం, నేరేడు పండ్ల నలుపు రంగు విష ప్రభావాలను నిరోధించే శక్తికి సంకేతమని చెబుతారు. నరసింహుని ఉగ్రతను శాంతింపజేసిన చిహ్నంగా దీనిని ప్రజలు భావిస్తారు. నేరేడు చెట్టు భారతదేశానికి చెందిన ప్రాచీన వృక్షాలలో ఒకటి. ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలో దీని ప్రాముఖ్యతను విపులంగా వివరించారు. సంస్కృతంలో దీనిని "జాంబు" అని పిలుస్తారు. రామాయణం మరియు మహాభారత కాలాల్లో కూడా ఈ పండుకు సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. పురాణాల ప్రకారం భారతదేశంలోని ఒక ప్రాంతాన్ని "జంబూద్వీపం" అని పిలిచేవారు. దాని అర్థం "నేరేడు చెట్ల దేశం" అని. ఇది నేరేడు చెట్టు ప్రాచీనతను తెలియజేస్తుంది. మొఘల్ కాలంలో నేరేడు పండ్లు రాజవంశీయుల ఆహారంలో కూడా ఉపయోగించబడేవి. వాటి రసంతో శీతల పానీయాలు తయారు చేసేవారు. ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చిన తరువాత నేరేడు చెట్టును ఇతర ఉష్ణమండల దేశాలకు పరిచయం చేశారు. నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండి, రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అందువల్ల మధుమేహంతో బాధపడేవారికి ఇవి ఎంతో ప్రయోజనకరంగా భావిస్తారు. నేరేడు గింజలను ఎండబెట్టి పొడి చేసి ఔషధంగా ఉపయోగిస్తారు. అలాగే దీని ఆకుల్లో కూడా జీవాణు నిరోధక గుణాలు ఉన్నాయి. నేరేడు చెట్టు గురించి ఒక విశేషం ఏమిటంటే, ఇది వంద సంవత్సరాలకు పైగా జీవించగలదు. దీని వేర్లు భూమిని గట్టిగా పట్టుకుని ఉంచుతాయి. అందువల్ల నేల కోతను నివారించడంలో సహాయపడతాయి. నేరేడు చెట్టు పక్షులకు ఆశ్రయం కల్పించే ముఖ్యమైన వృక్షం. దీని పండ్లను కాకులు, చిలుకలు మరియు ఇతర పక్షులు ఎంతో ఇష్టంగా తింటాయి. దీని నీడ దట్టంగా ఉండి, వేసవిలో చల్లని వాతావరణాన్ని అందిస్తుంది. గ్రామాల్లో నేరేడు చెట్టు కింద ప్రజలు కూర్చొని సంభాషించడం సాధారణంగా కనిపించే దృశ్యం. అందువల్ల ఇది కేవలం ఒక చెట్టుగానే కాకుండా, సామాజిక జీవితంలో భాగంగా కూడా మారింది. నేరేడు పండు కేవలం రుచికరమైన ఫలం మాత్రమే కాదు. అది పౌరాణిక కథల జ్ఞాపకం, చరిత్రకు గుర్తు, ఆరోగ్యానికి రక్షకుడు కూడా. నరసింహుని ఉగ్రతను శాంతింపజేసిన వృక్షమనే విశ్వాసం దీనికి మరింత విశిష్టతను కలిగించింది. ఇలాంటి ప్రకృతి సంపదలను సంరక్షించడం మన బాధ్యత. నేరేడు చెట్లను నాటి పెంచడం ద్వారా మనం పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, మన సంస్కృతి మరియు వారసత్వాన్ని భావితరాలకు అందించగలుగుతాము.

# మదనాపురం మండల నూతన కుమ్మర సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక

**మండల గౌరవ అధ్యక్షులు డా నరేష్**
**మండల అధ్యక్షుడు కె సత్యన్న**
**ప్రధాన కార్యదర్శి కె సురేష్**
**యూత్ గౌర అధ్యక్షులు డా శ్రీనివాసులు**
**మండల యూత్ అధ్యక్షుడు మేఘ శ్యామ్**
**ప్రధాన కార్యదర్శి కె .వెంకటేష్**



**వనపర్తి. జూలై 25 క్రైమ్** మిర్రర్ తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు. ప్రధాన కార్యదర్శి. దయానందు పిలుపుమేరకు, వనపర్తి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు సూగురు రాములు,ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు ఉపాధ్యక్షులు వైయస్ రాజశేఖర్. ఆధ్వర్యంలో మదనాపురం. గౌరవ అధ్యక్షులుగా డా.నరేష్. మండల అధ్యక్షులు సత్యన్న ప్రధాన కార్యదర్శిగా సురేష్. ఉపాధ్యక్షులు. కర్ణకర్. కోశాధికారిగా. అనిల్ యూత్ మండల గౌరవ అధ్యక్షులుగా అధ్యక్షుడు. కె.శ్రీనివాసులు. మండల యూత్ అధ్యక్షుడు మేఘ శ్యామ్. ప్రధాన కార్యదర్శి. కె .వెంకటేష్. ఉపాధ్యక్షులు రాము. కోశాధికారి. రవి. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం రోజు మండలం సంబంధించిన గ్రామాల కుమ్మరి సంఘం నాయకులు అభిప్రాయం సేకరణతో మదనాపురం మండలం సభ్యులతో ఎన్నుకోవడం జరిగింది.జిల్లా.అధ్యక్షులు సుగురు రాములు మాట్లాడుతూ పదవులను బాధ్యతయుతంగా భావించి, గ్రామ,మండల స్థాయిలో కుమ్మరి సంఘం బలోపితం చేయడానికి అందరం ఐక్యతతో కలిసి కావలసిన హక్కుల సాదరికత తోడ్పాటుగా కుమ్మరి సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి కొరకు ప్రతిష్టమైన బాధ్యత తీసుకుంటా మని,నూతన కమిటీ సభ్యులకు తెలిపారుజిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సూర్యవంశం పరుశరాముడు సమావేశంలో మాట్లాడుతూ,, కుమ్మర్లు ఏకాభిప్రాయంతో ఏదైనా సాధించవచ్చ న్నారు,మనలో ఐక్యత లేకుంటే, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మర్ల సంఖ్యా బలాన్ని గుర్తించకపోవడం. మనలో ఐక్య లేకపోవడంవల్లే ,,కుమ్మర్లు అట్టడుగున ఉండిపోయ మన్నారు. గ్రామాల నుండి బలోపేతం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా. కోశాధికారి శ్రీనివాసులు. స్వామి. కుమ్మర సంఘం. గౌరవ అధ్యక్షులు బొంబాయి కొండన్న. వనపర్తి రూలర్ మండల్ అధ్యక్షులు శివ. కొత్తకోట మండలం అధ్యక్షుడు.సత్యన. తిరుపతయ. ప్రచార కార్యదర్శి. రామకృష్ణ.జిల్లా కుమ్మర సంఘం నాయకులు , రామస్వామి. రవి. రామకృష్ణ. మదనపురం. అజ్జకొల్లు. దుప్పల్లి. రామన్ పాడు.సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు

# మండల పరిషత్ కార్యాలయంలో జలసిరీ పారిశుద్ధ్య వనమాహోత్సవం కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

**ఆత్మకూరు(ఎం),జూలై25/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం శనివారం రోజు మండల పరిషత్ కార్యాలయంలో జలసిరీ,పారిశుద్ధ్యం మరియు వనమాహోత్సవం కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ గుర్రం సురేష్, డీఎల్పీఓ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మరియు అడిషనల్ డీఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతుకు పంట కుంట, ప్రతి గ్రామానికి ఊట కుంట నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని వేగవంతంగా పనులు





చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే జల సంరక్షణ, పారిశుధ్యం మరియు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ జె.రాములు నాయక్,ఎంపీఓ నారాగోని శ్యామ్ కుమార్ గౌడ్, ఏఈ(పంచాయతీ రాజ్),ఏఈ (ఆర్డబ్ల్యుఎస్), విబిజీ రామ్ జీ ఏపీఓ బి రమేష్ గౌడ్,ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం గోదాసు నరసింహ,టెక్నికల్ అసిస్టెంట్లు ఏ మల్లేశం, డి శ్రీశైలం, జె యాదిరెడ్డి, డి నిర్మల, సీసీలు కొమురయ్య, హరిబాబు, కంప్యూటర్ అపరేటర్లు బి శ్రావణ్ కుమార్,ఎండీ మజీద్, నల్ల చంద్రస్వామి, మండల పరిధిలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివోఎలు మరియు ఏఫ్ఏలు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసు దర్యాప్తులో కీలక మలుపు..!!

**- మైనర్ బాలిక అపహరణ కేసు ఛేదించిన మహాదేవపూర్ పోలీసులు**
**- బాలిక వాంగ్మూలంతో పోక్సో కేసు నమోదు**
**- సూరారం యువకుడి అరెస్ట్..రిమాండ్**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన ఎం. వేణు (19) అనే యువకుడిని మైనర్ బాలిక కిడ్నాప్ చేసి, ఆమెపై లైంగిక నేరానికి పాల్పడిన కేసులో మహాదేవపూర్ పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలిక అదృశ్యమైన విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 115/2026గా తొలుత కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు ప్రత్యేకంగా విచారణ చేపట్టి బాలికను గుర్తించి రక్షించారు. దర్యాప్తులో భాగంగా బాధిత




మైనర్ బాలిక స్టేట్‌మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం నమోదు చేశారు. ఆమె ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడైన వివరాల ఆధారంగా నిందితుడు ఎం. వేణుపై పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్లను అదనంగా చేర్చి కేసును మరింత బలోపేతం చేశారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు అతడిని అధికారికంగా అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం లో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించడం తో జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితుడిని మహాదేవపూర్ ఎస్ఐ ఎం. సాంబమూర్తి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మైనర్ బాలికలపై జరిగే నేరాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, బాలల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లకు సంబంధించిన నేరాలు, వేధింపులు, కిడ్నాప్ వంటి ఘటనలు చోటుచేసుకున్న వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జాతీయ రహదారి విస్తరణలో నష్టపోయే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

## రుద్రారం గ్రామస్తులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ప్రజలకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు.. విస్తరణలో ఆస్తులు కోల్పోయే ప్రతి ఒక్కరికి సంపూర్ణ న్యాయం చేస్తామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. అతి త్వరలో జాతీయ రహదారుల సంస్థ ఈఎన్సి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ లతో కలిసి రుద్రారం గ్రామంలోనే సమావేశం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం రుద్రారం గ్రామంలోని వార్డు కార్యాలయంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విస్తరణ మూలంగా తాము ఎదుర్కొనబోయే నష్టాలను వివరించారు. రోడ్డు విస్తరణ ప్రారంభించే సమయంలో ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున విస్తరణ పనులు చేపడతామని చెప్పి.. నేడు 75 గజాలు నిర్ణయించడం సరికాదని వారు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని మూలంగా గ్రామస్తులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రజల విజ్ఞప్తి మేరకు అతి త్వరలో జాతీయ రహదారుల సంస్థ ఈఎన్సి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతి జనులకు కలిసి గ్రామ వార్డు కార్యాలయంలోనే గ్రామస్తుల సమక్షంలో సమావేశము ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపెడతామని హామీ ఇచ్చారు. ప్రధానంగా నష్టపోయే నిర్మాణానికి పరిహారంతో పాటు మరోచోట ప్లాట్ కేటాయింపు, మిగిలిన స్థలాలకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిఈ సందీప్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, కౌన్సిలర్లు వెంకటేష్, రాజు, సందీప్ గౌడ్, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, సిద్ధి వినాయక దేవాలయం కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, మన్నె రాజు, బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి.. వేముల పుష్పలత

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామంలో సర్పంచ్ రేగులగడ్డ స్వామి అధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం వేముల పుష్పలత బృందం గ్రామము నందు ఇండ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటిని వడిసిపట్టడం, ప్లాస్టిక్ వినియోగం నిషేదించడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి పాట రూపములో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో పంచాయితీ కార్యదర్శి గంజి వైష్ణవి, ఉపసర్పంచ్ బొమ్మగోని లింగమయ్య, వార్డు సభ్యులు మల్యాల నరేందర్, బొమ్మగోని మంగమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామప్రజలు పాల్గోనడం జరిగింది. అనంతరం ఫ్రై డే డ్రై డే సందర్భంగా పర్యవరణ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలములో బకెట్ల పై, బిందెలపై మూతలు పెట్టుకోవాలి అని హోటల్ యజమానులకు కలకారుల బృందం తరపున వేముల పుష్పలత తెలియజేయడం జరిగింది.

# ఘనంగా శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్ జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్ – శంకర్‌పల్లి** శనివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు, శంకర్‌పల్లి కాంగ్రెస్ మండల నాయకులు కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు చంద్రమోహన్‌పై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని చంద్రమోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చేకూర్తి గోపాల్ రెడ్డి , మున్సిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, చంద్రమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 20వ రోజూ విజయవంతంగా కొనసాగిన ఎస్ఐఆర్ సేవా యజ్ఞం

## ఎండీఆర్ ఫౌండేషన్ హెల్ప్‌డెస్క్‌ల ద్వారా వేలాదిమందికి సహాయం

## ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** పటాన్‌చెరులో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా యజ్ఞం 20వ రోజు విజయవంతంగా కొనసాగింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన సేవలను వాలంటీర్లు అందించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యార్థి వాలంటీర్ల బృందం ద్వారా దరఖాస్తు ఫారమ్‌లను నింపడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, నమోదు స్థితిని పరిశీలించడం, సందేహాలకు సమాధానాలు ఇవ్వడం వంటి సేవలు అందించారు. అలాగే బీఎల్ఓలకు అవసరమైన సహకారం అందిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పాటునందించారు. శ్రీనగర్, రాంకీ సింఫనీ, సింఫనీ పార్క్ హోమ్స్, ఏపీఆర్ లగ్జరియా, ప్రణీత్ ప్రణవ్ నైట్‌వుడ్స్, బండ్లగూడ గ్రామపంచాయతీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, శాంతినగర్, రాఘవేంద్ర కాలనీ, మంజీరా స్కూల్ పరిసరాలు, గౌతమ్‌నగర్, మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎండీఆర్ ఫౌండేషన్ ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ల ద్వారా వేలాది మంది ప్రజలు సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలను స్థానికులు, విద్యార్థులు, బీఎల్ఓలు అభినందిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం ఎండీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అందరూ సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఎలాంటి సహాయం అవసరమైనా ఎండీఆర్ ఫౌండేషన్ హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించాలని సూచించారు.

# క్యాతనపల్లి 7వ వార్డులో పర్యటించిన చైర్పర్సన్.. త్వరలోనే డ్రైనేజ్ పనులు ప్రారంభిస్తామనిహామీ

**రామకృష్ణాపూర్ జులై 25 (క్రైమ్ మిర్రర్)** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి రాజారమేష్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సాయి కుటీర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ



సమస్యలపై స్థానికులు వినతిపత్రం అందజేయడంతో శనివారం వార్డు కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్, సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్న చైర్‌పర్సన్, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతున్నట్లు గుర్తించారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్, డ్రైనేజీ నిర్మాణ పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

# వాటర్ మ్యాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫ్రాంచైజ్ ని ప్రారంభించిన ప్రముఖ సినీ నటులు

**-ఒకసారి రండి తిలకించండి మీ అనుభూతిని పంచుకోండి ఖమ్మం బైపాస్ రోడ్డులో విశాల్ మార్ట్ దగ్గరలో న్యూ పెట్రోల్ బంక్ పక్కన.**



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇండియా వైజ్ గా మొదటి బ్రాంచ్ ని ఖమ్మంలో ప్రారంభించడం మాకు ఎంతో సంతోషకరంగా ఉందని ప్రారంభోత్సవానికి వచ్చిన టాలీవుడ్ ప్రముఖ నటులు అఖండ ఆచార్య ఉగ్రం , శంబాల మూవీ యాక్టర్ శివాకార్తీక్ దండ శ్రీ =ఃశ 100, పుష్ప,భోళా శంకర్ యాక్టర్ కరుణ్ విజయ్ లు తెలిపారు . వినియోగదారులు ఒకసారి వాటర్ మ్యాజిక్స్ ను సందర్శించండి మీ అనుభూతిని పంచుకోండి అని పిలుపునిచ్చారు. నాణ్యమైన క్వాలిటీ ఎక్కువ కాలం మన్నిక అతి తక్కువ ఖర్చుతో ఎన్నో రకాల మీ అభిరుచికి తగ్గట్లుగా వాటర్ ఫౌంటైన్ మోడల్స్ అందుబాటులో ఉన్నాయని, 15 సంవత్సరాల అనుభవంతో ఖమ్మంలో ఈ బ్రాంచ్ ని ప్రారంభించామని వాటర్ మ్యాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి కృష్ణ రెడ్డి శ్యామల ఖమ్మం డీలర్ వినోద్ రెడ్డి పొన్నగంట్ల పేర్కొన్నారు. మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్ కార్పొరేట్ ఆఫీస్ అమీర్ పేట్ హైదరాబాద్లో ఉందని అన్నారు. 15 సంవత్సరాల నుండి కస్టమర్ దేవుళ్ల అభిమానం పొంది మ్యాను ఫ్యాక్చరింగ్ స్టేజ్ వరకు వచ్చామన్నారు. మమ్మల్ని ఆదరించండి ఇండోర్ అవుట్ డోర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ పార్క్ ల లో వాటర్ ఫౌంటైన్స్ ని అమర్చండి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందండి.

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి: సిపిఎం

**సంతకాల సేకరణతో ప్రభుత్వంపై ఒత్తిడి**
**ప్రజల ప్రాణాలను కాపాడాలని**
**కె. రాజయ్య డిమాండ్**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** పటాన్‌చెరులో రూ.300 కోట్ల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఫ్రీడమ్ పార్క్ వద్ద శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె. రాజయ్య మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరులో వేలాది పరిశ్రమలు, లక్షలాది కార్మికులు ఉన్నప్పటికీ అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభమైతే అనేక మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాశమైలారం సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందిన ఘటనను ప్రస్తావిస్తూ, అప్పటికే ఆస్పత్రి అందుబాటులో ఉండి ఉంటే పరిస్థితి కొంత మేర మెరుగ్గా ఉండేదని అన్నారు. నిర్మాణం పూర్తై ఏడాది దాటినా ఆస్పత్రిని ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆస్పత్రి ప్రారంభంలో రాజకీయ జాప్యం వీడి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, సత్తిబాబు, ప్రదీప్, నిరంజన్, శివరాజ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి: మెట్టు శ్రీధర్

**ఇస్నాపూర్ అభివృద్ధికి కమిషనర్‌కు వినతిపత్రం**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించి, పరిశుభ్రమైన, హరిత, ఆధునిక మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపులో ఉన్న అస్పష్టత, పునరావృత నంబర్లు, నంబర్లు లేకపోవడం వల్ల ప్రజలు ఆస్తి పన్ను, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేక సర్వే నిర్వహించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.అలాగే ప్రతి వార్డులో క్రమబద్ధమైన చెత్త సేకరణ, మొక్కల పెంపకం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణతో ఇస్నాపూర్‌ను ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన హరిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. అనేక కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి వార్డు లేదా కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్త కాలనీలు, కొత్తగా నిర్మించిన ఇండ్లకు తాగునీటి పైప్‌లైన్ విస్తరణ చేసి ప్రతి అర్హ కుటుంబానికి మున్సిపల్ తాగునీటి కనెక్షన్లు అందించాలని కోరారు. ఇస్నాపూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని మెట్టు శ్రీధర్ పిలుపునిచ్చారు. శ్రీకాంత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నూతన సీఐగా నిగిడాలా సురేష్ బాధ్యతల స్వీకరణ

**శాలువాతో ఘన సత్కారం చేసిన చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి**
**శాంతి భద్రతలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ**



**కూకట్ పల్లి, జూలై 25 (క్రైమ్ మిర్రర్) :**సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా నిగిడాలా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర నగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా నూతన సీఐని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, పూల బొకే అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ డివిజన్‌లో ముఖ్యంగా పాపిరెడ్డి నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం కోసం పోలీసు శాఖ చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నూతన సీఐ నిగిడాలా సురేష్‌కు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత సమర్థవంతంగా సేవలందించాలని నాయకులు ఆకాంక్షించారు. పోలీసు--ప్రజల మధ్య సమన్వయం బలోపేతమైతేనే నేరాల నియంత్రణతో పాటు సమాజంలో శాంతి నెలకొంటుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చర్ల రామకృష్ణ రెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, దొడ్ల రామిరెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, డాకూరి అక్కిరెడ్డి తదితరులు పాల్గొని నూతన సీఐ నిగిడాలా సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు శాఖతో సమన్వయంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని నాయకులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. నూతన సీఐ బాధ్యతల స్వీకరణతో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందుతాయనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.




# జేఎన్‌టీయూహెచ్‌లో ఈఏపీసెట్ విద్యార్థులకు అండగా ఏబీవీపీ

**ప్రవేశాల ప్రక్రియలో ప్రతి దశలో మార్గదర్శకత్వం.. ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు**
**సర్టిఫికెట్ వెరిఫికేషన్ నుంచి హాస్టల్, స్కాలర్‌షిప్‌ల వరకు సమగ్ర సహాయం**

**కూకట్ పల్లి, జూలై 25 (క్రైమ్ మిర్రర్) :**ఈఏపీసెట్ ద్వారా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్)లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జేఎన్‌టీయూహెచ్ యూనిట్ ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ప్రవేశాల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే సందేహాలను నివృత్తి చేస్తూ, చేరిక ప్రక్రియను సులభతరం చేయడం ఈ హెల్ప్‌డెస్క్ ముఖ్య ఉద్దేశమని యూనిట్ ప్రతినిధులు తెలిపారు. ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా కళాశాల ప్రవేశాల ప్రక్రియ, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు, హాస్టల్ వసతి, స్కాలర్‌షిప్‌లు, అకడమిక్ వివరాలు, తరగతుల ప్రారంభం వంటి ప్రవేశాలకు సంబంధించిన అన్ని అంశాలపై విద్యార్థులకు సమగ్ర సమాచారం, మార్గదర్శకత్వం, అవసరమైన సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఈఏపీసెట్ ద్వారా జేఎన్‌టీయూహెచ్‌లో చేరే వేలాది మంది విద్యార్థులు కొత్త వాతావరణం, ప్రవేశాల ప్రక్రియపై అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో ఈ హెల్ప్‌డెస్క్ వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ, విద్యార్థి సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జేఎన్‌టీయూహెచ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏబీవీపీ జేఎన్‌టీయూహెచ్ యూనిట్ విజ్ఞప్తి చేసింది.

# కూకట్ పల్లి నూతన సీఐని కలిసిన ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కర్కనాగరాజు



**కూకట్ పల్లి, జూలై 25 (క్రైమ్ మిర్రర్) :**కూకట్ పల్లి నూతన సీఐగా ఇటీవల పదవి భాధ్యతలు చేపట్టిన డి.స్వామి గౌడ్ ని కూకట్ పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు మర్యాదపూర్వకంగా వారిని కలిసి శాలువాతో సత్కరించి పూల మొక్కతో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా.బి ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఇన్స్పెక్టర్ స్వామి గౌడ్ ఈ సందర్భంగా కోరారు. కర్క నాగరాజు మాట్లాడుతూ కొత్త సి.ఐ అంకితభావంతో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించడం లో నిబద్ధతో కూకట్ పల్లి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి నాయకులు జక్కుల అశోక్, ఐ సి డి కంటైనర్ యూనియన్ నాయకులు జగన్, కర్క మహేష్, రమేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.